



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం,
ఆగస్టు 7, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




# మోదీని గద్దె దించుతాం: సీఎం రేవంత్

**రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకుంటాం.. బీసీలకు 42% రిజర్వేషన్లు సాధించి తీరతాం**

## ఢిల్లీ మహాధర్నాలో సీఎం రేవంత్

- తెలంగాణ ప్రజల శక్తిని, ఉద్యమ స్ఫూర్తిని ప్రధాని మోదీ
- తక్కువ అంచనా వేస్తే తడాఖా చూపిస్తాం
- ఇక ఢిల్లీకి రాము.. గల్లీలో బీజేపీ నేతలను పట్టుకుంటాం..
- ఆ పార్టీకి ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ 150 సీట్లు దాటవు
- నాడు కేసీఆర్ చేసిన చట్టమే నేడు గుదిబండగా మారిందన్న సీఎం
- బీజేపీ నేతలు బీసీ కోటా పెంపునకు అడ్డుపడుతున్నారంటూ ఫైర్
- ధర్నాకు గైర్హాజరైన ఖర్గే, రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపును ఆమోదించకుంటే రాహుల్‌గాంధీ నేతృత్వంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గద్దె దించుతామని హెచ్చరించారు. ఎర్ర కోటపై మూడు రంగుల జెండా ఎగురవేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకుని బీసీ రిజర్వేషన్ల డిమాండ్‌ను నెరవేర్చుకుంటామని చెప్పారు. తెలంగాణ ప్రజల శక్తిని, ఉద్యమ స్ఫూర్తిని మోదీ తక్కువగా అంచనా వేస్తే తడాఖా చూపిస్తామని అన్నారు. బిల్లులు ఆమోదం పొందే వరకు తాము నిద్రపోమని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదం కోరుతూ ఢిల్లీ జంతర్‌మంతర్‌లో టీపీసీసీ బుధవారం నిర్వహించిన మహాధర్నాలో సీఎం ప్రసంగించారు. 'గోద్రా అల్లర్ల సమయంలో రాజీనామా చేయమని నాటి ప్రధానమంత్రి వాజ్‌పేయి నాడు సీఎంగా ఉన్న నరేంద్ర మోదీని కోరితే చేయలేదు. 75 ఏళ్లు నిండినందున ప్రధాని పదవి నుంచి వైదొలగాలని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ కోరుతున్నా

(మిగతా 2వ పేజీలో)

# పేలిన ట్రంప్ టారిఫ్ బాంబు

**భారత్‌పై మరో 25% టారిఫ్ మోత మోగించిన అమెరికా అధ్యక్షుడు**

- మొత్తంగా 50 శాతానికి పెరిగిన అమెరికా సుంకాల భారం
- కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేసిన అగ్ర రాజ్యాధినేత
- రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోళ్లపై పట్టరాని కోపంతో పన్నులు పెంచిన ట్రంప్
- 140 కోట్ల ప్రజానీకం చమురు అవసరాలే ప్రధానమన్న ప్రధాని మోదీ సర్కార్
- మిత్రదేశమంటూనే సుంకాల సుత్తితో కొట్టడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన భారత్




న్యూయార్క్/న్యూఢిల్లీ: మెరుపువేగంతో వివాదాస్పద నిర్ణయాలు తీసుకునే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నంత పనీ చేశారు. 24 గంటల్లో మళ్లీ భారత్‌పై దిగుమతి టారిఫ్ విధిస్తానని చెప్పినట్టే బుధవారం అదనంగా 25 శాతం సుంకాన్ని మోపారు. వద్దని ఎంతగా వారించినా వైరి దేశం రష్యా నుంచి విపరీతంగా ముడి చమురును కొని, బహిరంగ మార్కెట్లో అమ్ముకుని లాభాల పంట పండిస్తున్నారని ఆరోపిస్తూ భారత్‌పై 25 శాతం టారిఫ్ విధిస్తూ బుధవారం ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. సంబంధిత కార్యనిర్వాహక ఉత్తర్వుపై శ్వేతసౌధంలో ఆయన సంతకం చేశారు. ఇప్పటికే ప్రకటించిన 25 శాతం టారిఫ్ నేటి నుంచి అంటే ఆగస్ట్ ఏడో తేదీ నుంచి అమల్లోకి రానుంది. బుధవారం ప్రకటించిన అదనపు 25 శాతం టారిఫ్‌ను 21 రోజుల తర్వాత అంటే ఆగస్ట్ 27వ తేదీ తర్వాత వర్తింపజేయనున్నారు. "రష్యా ముడిచమురును ప్రత్యక్షంగా, పరోక్షంగా భారత్ విచ్చలవిడిగా దిగుమతి చేసుకుంటోంది. అందుకే మా చట్టాల ప్రకారం అమెరికా కస్టమ్స్ సుంకాల పరిధిలోకి వచ్చే భారతీయ ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్‌ను మరోసారి పెంచాలని నిర్ణయించాం"అని కార్యనిర్వాహఖ ఉత్తర్వులో ట్రంప్ పేర్కొన్నారు. అదనపు టారిఫ్‌లకు స్పందనగా భారత్ ప్రతీకార నిర్ణయాలు తీసుకుంటే వైట్‌హౌస్ అందుకు తగ్గ టారిఫ్‌ల సవరణకు సిద్ధపడుతుందని ట్రంప్ సర్కార్ హెచ్చరించింది. మిత్రదేశమని కూడా చూడకుండా మితిమీరిన ఆవేశంతో భారత్ వీపు మీద పన్నుల వాత పెట్టి ట్రంప్ తన అగ్రరాజ్య అధిపత్యధోరణిని మరోసారి నిస్సిగ్గుగా ప్రదర్శించారు. స్నేహహస్తమందిస్తూనే సుంకాల సుత్తితో మోదడంపై భారత్ సైతం ధీటుగా, ఘాటుగా స్పందించింది. 140 కోట్ల జనాభా చమురు నిత్యావసరాలు, దేశ ఇంధన భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడబోమని మోదీ సర్కార్ స్పష్టంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదలచేసింది.

### 'అదనం'అమలుకు మినహాయింపులు

భారత్‌పై అమెరికా బుధవారం ప్రకటించిన ఈ అదనపు 25 శాతం టారిఫ్‌ను

(మిగతా 2వ పేజీలో)



## స్టేజీపై మాజీ హోంమంత్రికే అవమానమా ::: హరీష్‌రావు



## బాలిక అబార్షన్‌కు హైకోర్టు నో

## గాంధీ కుటుంబం అనుగ్రహం కోసమే..



**జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ ధర్నాపై కిషన్‌రెడ్డి ఎద్దేవా**



# 'సబ్ కా సాత్' అంతా డొల్ల

- బీసీ రిజర్వేషన్లకు మోదీయే అడ్డుగోడ
- అణగారిన వర్గాల కోసమే కాంగ్రెస్ పోరాటం
- ఇది న్యాయం, సమానత్వం కోసం పోరు
- కాంగ్రెస్ నేతలు ఖర్గే, రాహుల్, ప్రియాంక

న్యూఢిల్లీ: 'సబ్ కా సాత్ సబ్‌కా వికాస్'అనే మోదీ ప్రభుత్వ నినాదం అంతా డొల్ల అని, అణగారిన వర్గాల రిజర్వేషన్ల కోసమే తమ పోరాటమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో

(మిగతా 2వ పేజీలో)

## తెలంగాణలో 20 మంది ఆంధ్ర పెట్టుబడుదారుల

# బండారం బయటపెడతా.!

- తెలంగాణ వనరులను, ఆదాయం ఆంధ్రకు అప్పజెప్పితే మరో ఉద్యమానికి తెరలేపుతా!
- తెలంగాణ ఉద్యమం చేయనోడు, ఉద్యమం విలువ తెలువనోడు, వారికి నా విలువ ఎలా తెలుస్తుంది!
- ముఖ్యమంత్రి రేవంత్‌పై సంచలన ఆరోపణలు చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : మునుగోడు అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ కు సవాలు విసిరి రాజీనామా చేసిన, మునుగోడు నియోజకవర్గంలో ఉప ఎన్నిక తెచ్చిన ఘనత నాది, నా రాజీనామా తోనే మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి జరిగింది, ఇప్పుడు కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది మీ సహకారం కావాలని నన్ను వేడుకుంటే కాంగ్రెస్ పార్టీ లోకి వచ్చా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేశా, మరియు పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి ఎంపీ గెలుపుకు నాపై బాధ్యతలు పెడితే గెలిపించుకొని నిరూపించా అన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మంత్రి పదవి విషయంలో ఎంతోమంది నాపై కుట్ర చేస్తున్నారని తెలిపారు, నేను తెలంగాణ కోసం పోరాడిన నాయకుడిని, ఎంపీగా, ఎమ్మెల్సీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన నాకు మంత్రి పదవి ఇవ్వకుండా నిన్న,మన్న పార్టీలో చేరిన వారికి మంత్రి పదవి ఇస్తూ, కులాల సమీకరణలతో కొత్త వారికి కూడా మంత్రి పదవులు అందజేస్తూ, నన్ను అనగదొక్కాలని చూస్తున్న అధిష్టానానికి త్వరలో చుక్కలు చూపిస్తానన్నారు, ఎమ్మెల్యే పదవికి రాజీనామా కైనా సిద్ధమని పలు సందర్భాల్లో తెలిపారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

# మోదీని గద్దె దించుతాం: సీఎం రేవంత్



ఆయన పట్టించుకోవడం లేదు. మోదీ లేకపోతే బీజేపీకి 150 సీట్లు కూడా రావని ఆయన భక్తుడు నిశికాంత్ దూబే అంటున్నారు. ఈసారి బీజేపీకి ఎట్టి పరిస్థితుల్లోనూ 150 సీట్లు దాటవు. బీసీ రిజర్వేషన్లను మోదీ అడ్డుకుంటే ఆయనను గద్దె దించడం ఖాయం. రిజర్వేషన్ల పెంపు బిల్లులను ఆమోదించకుంటే ఇక ఢిల్లీ రాము.. గల్లీకి వచ్చినప్పుడు బీజేపీ నేతలను పట్టుకుంటాం. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వారసునిగా వచ్చిన రాహుల్‌గాంధీ బీసీలకు న్యాయం చేసేందుకు కంకణం కట్టుకున్నారు. సామాజిక న్యాయంపై రాహుల్‌గాంధీ శిలాశాసనానికి వ్యతిరేకంగా వస్తే అదే మరణ శాసనం అవుతుంది..'అని రేవంత్ హెచ్చరించారు.

### బీజేపీకి తెలంగాణ బీసీల అవసరం లేదా?

'బలహీన వర్గాలపై కక్ష గట్టిన గత ముఖ్యమంత్రి కేసీఆర్ మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా చట్టం చేశారు. నాడు కేసీఆర్ చేసిన చట్టమే నేడు రిజర్వేషన్ల పెంపునకు గుదిబండగా మారింది. తెలంగాణలో బలహీన వర్గాల బిడ్డలు.. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు కాకుండా అడ్డుగా ఉన్న చట్టాన్ని తొలగించాలని ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపినా ఆమోదించడం లేదు. కేసీఆర్‌తో పాటు బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావులు బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డుపడుతున్నారు. రాష్ట్ర బీజేపీ నేతలకు తెలంగాణ బీసీల అవసరం లేదా? బీఆర్ఎస్ నాయకులు బీసీ రిజర్వేషన్ల పెంపు ధర్నాకు ఎందుకు రాలేదు? తెలంగాణతో పేరు బంధంతో పాటు పేగు బంధం కూడా తెంచుకుందా?

### ఆ అదృష్టం నాకు దక్కింది

'దేశంలో వందేళ్ల కాలంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేయలేదు. ఇప్పటివరకు దేశంలో 300 మంది ముఖ్యమంత్రులైనా ఎవరూ చేయని పనిని చేసే అదృష్టం నాకు దక్కింది. బీసీల రిజర్వేషన్లు పెంచే అవకాశం నాకు వచ్చింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకే ఢిల్లీలో ధర్నాకు దిగాం. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా సాధించి తీరతాం..'అని ముఖ్యమంత్రి అన్నారు.

### కేటీఆర్ బుద్ధి మారలేదు.. అహంకారం తగ్గలేదు

బీసీ రిజర్వేషన్ల పెంపు ధర్నాను కేటీఆర్ డ్రామా అంటున్నారు. కానీ కేటీఆర్ పేరే డ్రామారావు. కేసీఆర్ కుటుంబం డ్రామాలతో బతుకుతోంది. అధికారం, పదవులు పోయినా కేటీఆర్ బుద్ధి మారలేదు..అహంకారం తగ్గలేదు. ఆ కుటుంబంలోనే ఒకరు రిజర్వేషన్లకు అనుకూలం.. మరొకరు ప్రతికూలం.. మరొకరు అటూఇటూ కాకుండా మాట్లాడుతున్నారు..'అని సీఎం ధ్వజమెత్తారు.

# పేలిన ట్రంప్ టారిఫ్ బాంబు

వెంటనే వర్తింపజేయబోమని ట్రంప్ సర్కార్ స్పష్టంచేసింది. ట్రంప్ సంతకం చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ అమల్లోకి వచ్చిన 21 రోజుల తర్వాత ఈ అదనపు 25 శాతాన్ని భారతీయ ఉత్పత్తులపై వర్తింపజేస్తారు. ఇప్పటికే నౌకల్లోకి ఎక్కించిన సరకుపై ఈ అదనపు 25 శాతం సుంకాన్ని విధించబోరు. అలాగే బుధవారం అర్ధరాత్రిలోపు అమెరికా చేరుకునే ఉత్పత్తులపైనా ఈ అదనపు భారం మోపబోరు. సెప్టెంబర్ 17వ తేదీ అర్ధరాత్రిలోపు అమెరికాలో మార్కెట్లోకి వచ్చేసిన భారతీయ ఉత్పత్తులపై ఈ అదనపు వడ్డింపు ఉండదు.

### తాము నష్టపోకుండా ముందుజాగ్రత్త

భారత్‌పై రెట్టింపు పన్నులతో రెచ్చిపోయిన ట్రంప్.. ఈ అదనపు సుంకాలు అమెరికా ఖజానాకు నష్టదాయకంగా మారకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రంగాలవారీగా టారిఫ్ వసూలుచేస్తున్న ఉక్కు, అల్యూమినియంతోపాటు అత్యంత కీలకమైన ఫార్మాస్యూటికల్స్‌పై ఈ అదనపు భారం ఉండబోదని తెలుస్తోంది. తద్వారా అమెరికాలో ధరల పెరగకుండా జాగ్రత్తపడుతున్నారు. ట్రంప్ విధించిన అదనపు టారిఫ్ కారణంగా భారత్‌లో సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతి సంక్షోభంలో పడనుంది. టెక్స్‌టైల్స్, సముద్ర ఉత్పత్తులు, తోలు, సానబట్టిన వజ్రాలు, రత్నాభరణాల ఎగుమతులపై అదనపు టారిఫ్ భారం పడొచ్చు. దీంతో అమెరికాకు ఎగుమతి అవుతున్న వస్తూత్పత్తుల పరిమాణం సగానికి సగం తగ్గిపోవచ్చని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య(ఎఫ్ఐఈఓ) ఆందోళన వ్యక్తంచేసింది.

### అత్యంత విచారకరమన్న భారత్

అదనంగా 25 శాతం టారిఫ్‌ల గుదిబండ పడేయడంపై భారత్ తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ బుధవారం రాత్రి ఒక అధికారిక ప్రకటన విడుదలచేసింది. "రష్యా నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్న ముడి చమురునిల్వలను చూసి అమెరికా కళ్లలో నిప్పులు పోసుకుంటోంది. ఈ అంశంలో భారత్ తన వైఖరిని ఇప్పటికే సుస్పష్టంచేసింది. ముడిచమురు వంటి ఇంధన దిగుమతులు అనేవి పూర్తిగా మార్కెట్ ఒడిదుడుకులను అనుసరించి జరుగుతాయి. దేశ ఇంధన భద్రతే ఏకైక లక్ష్యంగా భారత్ ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోంది. భారత్‌పై అదనపు టారిఫ్ విధించడం ద్వారా ఎక్కువ సొమ్ములు కళ్లజూడాలని అమెరికా ఆశపడటం అత్యంత విచారకరం. ఇలాంటి చర్యలు ఏమాత్రం సబబుగా లేవు. ఇవన్నీ సహేతుకంకాని అన్యాయమైన నిర్ణయాలు. 140 కోట్ల మంది ప్రజల ఇంధన అవసరాలు మా తక్షణ కర్తవ్యం. ఇంతటి అత్యంత కీలకమైన బాధ్యతల నుంచి భారత్ ఏనాడూ పక్కకు తొలగిపోదు. దేశ ప్రయోజనాలు, ఇంధన సంక్షోభ నివారణ చర్యల విషయంలో భారత్ ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుంది. విదేశాలు తీసుకునే భారతవ్యతిరేక నిర్ణయాలపై కేంద్ర ప్రభుత్వం తగు కఠిన చర్యలు తప్పక తీసుకుంటుంది. జాతి ప్రయోజనాల పరిరక్షణ కోసం ఎలాంటి నిర్ణయాలైనా తీసుకుంటుంది. స్వప్రయోజనాల కోసం ప్రతిదేశం స్వీయ నిర్ణయాలు తీసుకుంటుందని అమెరికా స్ఫురణకు తెచ్చుకుంటే మంచిది"అని భారత విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది. గత మూడ్రోజుల్లో ట్రంప్ ప్రభుత్వానికి దీటుగా భారతప్రభుత్వం ఘాటైన జవాబివ్వడం ఇది రెండోసారి.

### బ్రెజిల్.. భారత్ ఒక్కటే

అమెరికా దృష్టిలో బ్రెజిల్, భారత్ ఒక్కటేనని తాజా పన్నుల పెంపు పర్వంతో తేలిపోయింది. బ్రెజిల్‌పై అమెరికా ఇప్పటికే 50 శాతం టారిఫ్ విధిస్తుండగా భారత్‌పై తాజా పెంపుతో భారతీయ ఉత్పత్తుల దిగుమతి టారిఫ్ సైతం 50 శాతానికి చేరింది. మయన్మార్ ఉత్పత్తులపై 40 శాతం, థాయిలాండ్ కాంబోడియాలపై 36 శాతం, బంగ్లాదేశ్‌పై 35 శాతం, ఇండోనేసియాపై 32 శాతం, చైనా, శ్రీలంకలపై 30 శాతం, మలేసియాపై 25 శాతం, ఫిలిప్పీన్స్, వియత్నాంలపై 20 శాతం టారిఫ్‌ను అమెరికా విధించిన విషయం విదితమే.

# 'సబ్ కా సాత్' అంతా డొల్ల



ప్రధాన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. న్యాయం ఆలస్యం కావడమంటే, దాన్ని నిరాకరించడమేనని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వ్యాఖ్యానించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన బిల్లులకు కేంద్రం ఆమోదం తెలపాలని కోరుతూ బుధవారం జంతర్ మంతర్ వద్ద టీపీసీసీ ధర్నా పురస్కరించుకుని వారు 'ఎక్స్'లో తమ అభిప్రాయాలను వెల్లడించారు.

### సామాజిక న్యాయం కోసం తెలంగాణ సర్కారు కృషి: ఖర్గే

'విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో ఓబీసీలకు 42% రిజర్వేషన్ హక్కు కోసం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు ఆమోదించింది. కానీ రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండటంతో.. రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీలో మహాధర్నా చేపట్టారు. రాష్ట్రంలో కుల సర్వే అనంతరం సామాజిక న్యాయాన్ని బలోపేతం చేసే చర్య మా ప్రభుత్వం తీసుకుంది. 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్'అనే మోదీ ప్రభుత్వ నినాదం అంతా డొల్ల. ఎందుకంటే ఈ బిల్లులకు, అణగారిన వర్గాల హక్కులకు మోదీయే అడ్డుగోడగా ఉన్నారు..'అని ఖర్గే ధ్వజమెత్తారు.

### అణగారిన వర్గాల కోసమే ఈ పోరాటం: రాహుల్ గాంధీ

'తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో ధర్నా చేశా యి. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపాలని వారు డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం దిశగా ఈ బిల్లు ఒక పెద్ద ముందడుగు. మద్దతు ఇచ్చిన 'ఇండియా'నేతలకు నా కృతజ్ఞతలు. రాష్ట్రపతి దీనిని గుర్తించి ఆమోదిస్తారని ఆశిస్తున్నా. ఈ పోరాటం కేవలం తెలంగాణ కోసం మాత్రమే కాదు. దేశంలోని అణగారిన వర్గాలకు అధికారం, హక్కుల కోసం జరుపుతున్న సమిష్టి పోరాటం.'. అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

### చరిత్రాత్మక బిల్లు

'తెలంగాణ ప్రభుత్వం చరిత్రాత్మక బిల్లు ఆమోదించింది. అయితే ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం అక్కడే ఆగిపోయింది. ఇందుకు నిరసనగా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఢిల్లీలో ధర్నా చేపట్టారు. రాష్ట్రపతి తక్షణమే బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశా రు. ఇది కేవలం తెలంగాణ పోరాటమే కాదు. అణగారిన వర్గాలకు న్యాయం, సమానత్వం, న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం కోసం జాతి యావత్తు చేస్తున్న ఆందోళన. న్యాయాన్ని ఆలస్యం చేయడమంటే, దాన్ని తిరస్కరించడమే..'అని ప్రియాంకా గాంధీ స్పష్టం చేశారు.

# యూరియా కొరత తీర్చండి



హైదరాబాద్: రాష్ట్రంలో యూరి యా లోటు తీర్చాలని, క్రూడ్ పామాయిల్ ఆయిల్ పై దిగుమంతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం పార్లమెంటులో ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డితో కలసి కేంద్ర మంత్రులు జెపి నడ్డా, నిర్మాలా సీతారామన్‌లను కలుసుకుని విజ్ఞ ప్తి చేశారు. ఆగస్టు నెల కేటాయింపులు, ఏప్రిల్ నుంచి జూలై వరకు ఏర్పడిన యూరియా లోటు ను ఆగస్టు నెలతో కలిసి సరఫరా చేయాలని కేంద్ర మంత్రి నడ్డాను కోరారు. అదేవిధంగా క్రూడ్ పా మాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి తుమ్మల సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 10.9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు మాత్రమే అందుబాటులో ఉ న్నాయని, యూరియా సరఫరాలో ఆలస్యం అయి తే రైతాంగం ఇబ్బందులు పడే అవకాశం ఉందని మంత్రి తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిన కోటాను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఏప్రిల్ నుంచి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియా సరఫరాలో ఏర్పడిన కొరత 2.10 లక్షల మెట్రిక్ టన్నులను కలుపుకుని ఆగస్టులో విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ను కలుసుకున్న సందర్భంగా మంత్రి తుమ్మల క్రూడ్ పామాయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం క్రూడ్ పామాయిల్ దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించడం వల్ల ఆయిల్ పామ్ గెలల ధర తగ్గడంతో పాటు కేంద్రం నిర్ణయం ఆయాల్ పామ్ సాగు ప్రోత్సాహకానికి గుదిబండగా మారిందని విచారం వ్యక్తం చేశారు. ఇంతకు ముందే దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 44 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించిన విషయాన్ని మంత్రి తుమ్మల ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రస్తుతం సాగు సీజన్ ప్రారంభమైన నేపధ్యంలో రాష్ట్రాలు రైతాంగానికి ప్రొత్సాహకాలు కల్పిస్తున్నాయని, ఈ నేపధ్యంలో కేంద్ర ప్రభుత్వం దిగుమతిసుంకం పెంపుదల అంశాన్ని మరోసారి సమీక్షించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకంలో దేశంలోనే తెలంగాణ ఆయిల్ ప్లాంటేషన్ లో తొలిస్థానంలో ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణ కోసం చేస్తున్న కార్యక్రమాలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించారు.



## శ్రీశైలం పై చర్యలు తీసుకోవాలి... జడ్‌సీకి మున్సిపల్ ఉద్యోగుల వినతి

వార్త మిర్రర్, ఎల్బీనగర్ : గత కొన్ని రోజులుగా సరూర్ నగర్ సర్కిల్ -05 టీ ఐ ఆనంద్ కుమార్ ఏఎంసి శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ సుజాతల పై అసత్య ఆరోపణలు చేస్తున్న బిల్ కలెక్టర్ వి. శ్రీశైలం ప్రచారాన్ని ఖండిస్తూ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కు మున్సిపల్ ఉద్యోగులు వినతి పత్రాన్ని అందించారు. డిప్యూటీ కమిషనర్, ఏఎంసి, టిఐలు తనను విధులు నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని బిల్ కలెక్టర్ శ్రీశైలం జిహెచ్ఎంసి కమిషనర్ కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే, శ్రీశైలం తప్పుడు ఆరోపణలను చేస్తున్నారని ఎల్బీనగర్ జోన్ కు సంబంధించిన 1,2,3,4,5సర్కిల్ ఉద్యోగులు, జిహెచ్ఎంసి రెవిన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జోనల్ కమిషనర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేసింది.

## ఏపీ, తెలంగాణకు భారీ వర్ష సూచన.. ఈ జిల్లాల్లో గట్టి వానలు

**ఉపరితల ఆవర్తనంతో రెండ్రోజులు వర్షాలు**

**దక్షిణ కోస్తా, రాయలసీమ, తెలంగాణకు వర్ష సూచన**

**ఉత్తరాంధ్రలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం**

విశాఖపట్నం: ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు ఉపరితల ఆవర్తనం కాస్త ఉపశమనం కలిగించనుంది. ఉత్తర తమిళనాడు, నైరుతి బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్ర మట్టానికి 1.5 నుంచి 4.5 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. దీని ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలపై కనిపించనుంది. ఈ క్రమంలో సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా తేలి కపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి. పలుచోట్ల పిడుగులు పడే ప్రమాదం ఉంది. అదేవిధంగా.. ఉత్తరాంధ్రులో మాత్రం ఒకట్రెండుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుంటాయి. తీరం వెంబడి 40 నుంచి 50 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అల్పపీడనం కారణంగా తెలం గాణలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. నేడు తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ వర్షాలు ఉరుములు, మెరుపులతో కూడి ఉంటాయని, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నేడు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, హన్మకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలపై ఈ వాయుగుండం ప్రభావం అధికంగా ఉంటుందని అధికారులు వివరించారు. ఆగస్టు 5 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గత 24 గంటల్లో నారాయణపేట జిల్లాలోని మాగనూరులో అత్యధికంగా 3.13 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, కామారెడ్డి జిల్లాలోని జుక్కల్‌లో 2.74 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఇక ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఉత్తర భారతదేశం వైపు ఎక్కువగా కేంద్రీకృతం కావడంతో ఆ ప్రాంతంలో భారీ వర్షాలు కురిశాయి. నైరుతి గాలులు పొడిబారిపోవడం కూడా వర్షాలు తగ్గడానికి ఒక ముఖ్య కారణంగా నిపుణులు పేర్కొన్నారు.

## నీట్ యూజీ కౌన్సెలింగ్‌కు కొత్త షెడ్యూల్

**9 నుంచి రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ ప్రారంభం**

**సుప్రీంకోర్టులో కేసు కారణంగా షెడ్యూల్‌లో మార్పు**

**స్టేట్ స్ట్రే వేకెన్సీ కౌన్సెలింగ్ .. అక్టోబర్ 2 నుంచి 5 వరకు**

**అక్టోబర్ 10తో ముగియనున్ననీట్ యూజీ ప్రవేశాలు**

**తాజా షెడ్యూల్ విడుదల చేసిన కాళోజీ యూనివర్సిటీ**



హైదరాబాద్: నీట్‌యూజీ-2025లో భాగంగా మెడికల్ కాలేజీల్లో రాష్ట్ర కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల కౌన్సెలింగ్‌కు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది. గత నెల 12వ తేదీన ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్ జూలై 21 నుంచి ప్రారంభమైతే, స్టేట్ కోటా కౌన్సెలింగ్ అదే నెల 30 నుంచి ప్రారంభం కావలసి ఉంది. అయితే, స్థానికత అంశంపై సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండటంతో స్టేట్ కోటా కౌన్సెలింగ్‌ను వాయిదా వేశారు. మంగళవారం స్థానికత అంశంపై సుప్రీంకోర్టులో వాదనలు ముగిసి, తీర్పు రిజర్వు చేసిన నేపథ్యంలో వర్సిటీ కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది. అదే సమయంలో ఆల్ ఇండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ వర్సిటీ ప్రవేశాల కౌన్సెలింగ్ తేదీల్లో కొన్ని మార్పులు జరిగినట్లు తెలిపింది. ఆల్ ఇండియా కోటాలో జూలై 21 నుంచి 30 వరకు తొలి విడత కౌన్సెలింగ్ జరగాల్సి ఉండగా, దానిని ఆగస్టు 9 వరకు పొడిగించారు. స్టేట్ కోటా తొలి విడత కౌన్సెలింగ్‌ను ఆగస్టు 9 నుంచి 18 వరకు నిర్వహించాలని వర్సిటీ నిర్ణయించింది. మూడు విడతల తర్వాత ఆల్ ఇండియా కోటా కింద స్ట్రే వేకెన్సీ కోటా కౌన్సెలింగ్ సెప్టెంబర్ 30 నుంచి 4 అక్టోబర్ వరకు జరగనుంది. రాష్ట్ర కోటాలో స్ట్రే వేకెన్సీ కోటా కౌన్సెలింగ్ అక్టోబర్ 2 నుంచి 5 వరకు నిర్వహిస్తారు. అక్టోబర్ 10వ తేదీతో ఆల్ ఇండియా కోటాతోపాటు స్టేట్ కోటా ప్రవేశాల ప్రక్రియ ముగుస్తుందని యూనివర్సిటీ ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పు 9వ తేదీ వరకు వెలువడే అవకాశం ఉందనే ఉద్దేశంతోనే వర్సిటీ కొత్త షెడ్యూల్ ప్రకటించినట్లు తెలుస్తోంది. కాగా, బీఎస్సీ, బీడీఎస్, ఇతర అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల అకడమిక్ సెషన్ సెప్టెంబర్ 5 నుంచి ప్రారంభం కానుంది.

# తెలంగాణ ప్రజలను రేవంత్ రెడ్డి నిలువునా మోసం చేశాడు

**- మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి**





కల్వకుర్తి ఆగస్టు 6 వార్త మిర్రర్ ప్రతినిధి:- ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనితహశీల్దార్ ఇబ్రాహీంకు వినతి పత్రం అందించిన బిజెపి నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను 6 గ్యారంటీ లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ ఇబ్రాహీం బుధవారం బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి స్థానిక నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. బిజెపి పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబీదేవ్ ఆధ్వర్యంలో స్థానిక పాలమూరు చౌరస్తా నుంచి పెద్ద ఎత్తున బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలతో ర్యాలీ గా శివాజీ చౌక్ లో ఏర్పాటు చేసిన సభలో బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు ఆచారి మాట్లాడుతూ అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అదికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇచ్చిన హామీలు రైతులకు రైతు బంధు 15 వేలు, వృద్దులకు 4 వేల పెన్షన్, వికలాంగుల కు 6 పెన్షన్, యువతకు నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ వివాహానికి తులం బంగారం ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి మాట తప్పిన కాంగ్రెస్ పార్టీ కి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో తగిన విధంగా బుద్ది చెప్పాలని, ఈ నెల 15 తేదీ లోపు ఇచ్చిన హామీలను అమలు చెయ్యాక పోతే ఈనెల 30 చలో కొండారెడ్డి పల్లకి వృద్దులు, వికలాంగులు, వితంతువులతో నియోజకవర్గం ముఖ ద్వారం కడ్తల్ నుంచి ముఖ్య మంత్రి సొంత ఊరు కొండారెడ్డి పల్లకి ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు.ఆనతరం ర్యాలీ గా తరలి వెళ్ళి తహశీల్దార్ ఇబ్రాహీం డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బండేలా రామచంద్రారెడ్డి,కండె హరిప్రసాద్,రాంభూపాల్ రెడ్డి,దుర్గాప్రసాద్, రాఘవేందర్ గౌడ్,శేఖర్ రెడ్డి,బోడ నరసింహ,శ్యామ్,గుండోజు గంగాధర్,వివేకానంద, నరేష్ గౌడ్,సురేందర్ గౌడ్, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కమీషన్లు రావనే విద్యార్థుల స్కాలర్షిప్ బకాయిలు చెల్లించడం లేదు ప్రభుత్వం

**బకాయిలు వెంటనే విడుదల చేయాలి రామన్నపేటలో ధర్నా**

**పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్**



ప్రత్యేక ప్రతినిధి( వార్త మిర్రర్ ) ఆగస్టు 06: విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిల మీద రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణన్న ఆదేశాల మేరకు బీసీ విద్యార్థి సంఘం రామన్నపేటలో విద్యార్థులతో కలిసి మహాధర్నా నిర్వహించారు విద్యార్థుల ఫీజు రీయంబర్స్మెంట్ చెల్లిస్తే కమీషన్లు రావని.అదే కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తే 20% నుంచి 30 %శాతం కమీషన్లు వస్తాయని.అందుకే 30 లక్షల నిరుపేద విద్యార్థులకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించడం లేదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్ ఆరోపించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఎనిమిది 8 వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలని రామన్నపేటలో కాలేజీ బాయ్స్ గర్ల్స్ హాస్టల్స్ ఏర్పాటు చేయాలి ఫీజ్ రీయంబర్స్మెంట్ స్కీమ్ను ఎత్తేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని ఆయన స్పష్టం చేశారు. చాలాకాలంగా పెండింగ్లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు రీయెంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఒకవైపు ఫీజు బకాయిలు చెల్లించకుండా మరోవైపు ఫీజుల స్కీములను ఎత్తేయడానికి ట్రస్ట్ బ్యాంకును ఏర్పాటు చేసి, దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామన్న కొత్త నాటకంకు తెర లేపారని ఆరోపించారు. ప్రభుత్వ నాయకుల జీతాలకు పెట్టుకోండి ట్రస్ట్ బ్యాంక్ ఈ ప్రతిపాదన ఎట్టి పరిస్థితు ల్లోనూ అంగీకరించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించక బీసీ,ఎస్సీ,ఎస్టీ,ఈబీసీ విద్యార్థులు ఇబ్బందులు పడు తున్నారని ఉన్నత చదువులు మానేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుసున్నా కనీసం రూ.20 రూపాయలు కూడా విద్యార్థులకు చెల్లించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ కాలేజీ హాస్టళ్లలో సీట్లు లభించక విద్యార్థులు రైల్వేస్టేషన్, బస్టాం డ్లలో స్నానాలు చేస్తూ రాత్రివేళ అక్కడే పడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కొత్తగా రాష్ట్రంలో 100 బీసీ కాలేజీ హాస్టళ్లను మంజూరు చేయాలని, ప్రస్తుతం ఉన్న హాస ళ్లలో 20 శాతం సీట్లు పెంచాలని కోరారు. విద్యార్థులకు ఇచ్చిన యూత్ డిక్లరేషన్ అమలు చేయాలి ప్రతి విద్యార్థికి ఐదు లక్షల భరోసా కార్డు ఇవ్వాలి సంక్షేమస్టులకు సొంత భవనాలు నిర్మించాలి ఫీజు రీయింబర్స్ స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలి విద్యార్థుల అన్ని సమస్యలు వెంటనే పరిష్కరించలి లేని ఎడల రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు చేసి రాష్ట్ర ప్రభుత్వంని అట్టుడికి ఇస్తామని హెచ్చరించారు ఈ సమావేశంలో ఎడ్ల మహాలింగం,మోటే నవీన్,మాదం లింగస్వామి,మైపాల్ రెడ్డి,రజాక్, ఉపేందర్,దీపక్, ప్రవీణ్, వైష్ణవి,రమాదేవి,విష్ణు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు

# 13న ఆలేరులో వికలాంగులు చేయూత పెన్షన్దారుల మహాసభ

**రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచాలి.**

**ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ**



ప్రత్యేక ప్రతినిధి( వార్త మిర్రర్) ఆగస్టు 06:వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు మరియు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, మరియు అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ 4 వేలకు పెంచాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా ఈ నెల 13 వ తేదీన ఆలేరు నియోజకవర్గం కేంద్రంలో చేయూత పెన్షన్ దారుల మహాసభను నిర్వహిస్తున్నామని ముఖ్య అతిథిగా పెన్షన్ దారుల ఆశాజ్యోతి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ అన్నారు.ఆలేరు నియోజకవర్గం కేంద్రం లోని రహదారి బంగ్లా లో నియోజక వర్గ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి విహెచ్పిఎస్ కార్యకర్తల సమావేశం ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మార్పియస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు పెంచి ఇస్తున్నాడు.కానీ తెలంగాణలో రూ 6 వేలు ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులను మోసం చేశాడని అన్నారు.2023 ఎన్నికల సమయంలో వికలాంగుల పెన్షన్ 6 వేలుమిగితా చేయూత పెన్షన్ దారుల పెన్షన్ రూ 4 వేలకు పెంచుతామని రేవంత్ రెడ్డి బహిరంగంగా హామీ ఇచ్చారు. ఈ నెల ఓటు వేయండి , వచ్చే నెల పెరిగే పెన్షన్ తీసుకొండని మాట్లాడిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 20 నెలలు దాటినా ఒక్క రూపాయి కూడా పెంచలేదని అన్నారు.ఇది ఘోరమైన మోసం అని అన్నారు. ఈ మోసం గురించి ప్రతిపక్షాలు కూడా మాట్లాడకుండా చేయూత పెన్షన్ దారులకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు.కాబట్టే 50 లక్షల మంది పెన్షన్ దారుల పక్షాన మంద కృష్ణ మాదిగ పోరాటానికి శ్రీకారం చుట్టారని అన్నారు.అందులో భాగంగా తెలంగాణ నలుమూల తిరుగుతూ 13 వ తేదీన ఆలేరు కు వస్తున్నారని అన్నారు.ఆలేరు నియోజక వర్గ పరిధిలో ఉన్న అన్ని రకాల చేయూత పెన్షన్ దారులు మహాసభకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలోఎమ్మార్పియస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ,జాతీయ నాయకులు కందుల శంకర్ మాదిగ,ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ,ఎమ్మార్పియస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ,వి ఎచ్ పి యస్ జిల్లా అధ్యక్షులు ధరణి కోట నర్సింహ్మాఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందేల శ్రీనివాస్ మాదిగ,మార్కెట్ డైరెక్టర్ చిలుకు కిష్టయ్య,వివిధ మండలాల నుండిఎమ్మార్పియస్, ఎంఎస్పీ, వి ఎచ్ పి యస్ నాయకులు సిద్దా రెడ్డి, లోడి ధనుంజయ్య గౌడ్,గుజ్జ అశోక్, బండ జహంగీర్,సింగారం రమేష్,సిలువేరు విజయ్,సందేపల్లి రామ్ నర్సయ్య మాదిగ, కంతి దిలీప్, కంతి శ్రీనివాస్, జెరిపోతుల కరుణాకర్, ఆకారపు లక్ష్మీ నారాయణ, ఆదేపు పాండు,అఖిల్, పర్రె రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కై చలో హైదరాబాద్

మిర్యాలగూడ ,ఆగస్టు 6:-( వార్త మిర్రర్) : గత ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పట్టించుకోకపోవడం వలన ఎన్నికలలో ఆ ప్రభుత్వాన్ని ఓడించి అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినప్పటికీ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించక పోవడం కాక కనీసం సంఘాలను పిలిచిన మాట్లాడిన ఒసే లేదు విసికి, వేసారి బాధ తప్త హృదయముతో పోరాట బాట పట్టవలసి వచ్చింది అని పెన్షనర్ల సమన్వయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పన్నాల గోపాల్ రెడ్డి పెన్షనర్ల సమావేశానికి హాజరై మాట్లాడినారు పెన్షనర్ల సమస్యల సాధనకై తెలంగాణ ప్రభుత్వ పెన్షన్ దారుల సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమమును చేపట్టడం జరిగిందని ఈనెల 11వ తేదీన ఇందిరాపార్కు వద్ద జరిగే పెన్షనర్ల మహా ధర్నాకు నల్గొండ జిల్లా నుండి వేల మంది పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన నెల లోపే ఈ హెచ్ ఎస్ స్కీం పూర్తి చేసి పరిశీలిస్తామని నెల లోపులో మూడు డిఏలు ఇస్తామని ఆరు నెలల్లో పి.ఆర్.సి ప్రకటిస్తామని చెప్పిన ఈ ప్రభుత్వం 18 నెలలు గడిచినప్పటికీ ఒక్క సమస్య కూడా పరిష్కరించ పోగా పెన్షనర్ల సంఘాల తో మాట్లాడ లేదన్నారు . పెన్షనర్ల సమన్వయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఇచ్చిన హామీలతో పాటు 398 స్పెషల్ టీచర్ల కు నేషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేసినారు. చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు



## ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి ఘన నివాళులర్పించిన బీఆర్ఎస్ నేతలు

మిర్యాలగూడ , ఆగస్టు 6:-( వార్త మిర్రర్) : మిర్యాలగూడ పట్టణం బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ రాష్ట్ర సాధన రూపశిల్పి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బుధవారం అయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అర్పించారు. మాజీ సిఎం, బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ కి పలు సూచనలు చేస్తూ ఎప్పటికప్పుడు ఉద్యమ జ్వాలాన్ని నింపుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి ప్రధాన భూమిక పోషించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, అన్న భీమోజు నాగార్జునచారి, పెద్ది శ్రీనివాస్ గౌడ్, ఎండి ఇలియాస్ ఖాన్ ఎండి షోయబ్ ,పూనాటి లక్ష్మీనారాయణ, డి. వెంకటేష్ ,గుడిసె దుర్గప్రసాద్, చిట్టిపోలు వెంకటేశ్వర్లు, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, జానకిరెడ్డి, సందేశ్ అంజన్ రాజు, తిరందాసు విష్ణు, మాలావత్ రవీందర్ నాయక్, మునినాయక్, మన్నెం శ్రీనివాస్ రెడ్డి, కొర్రపిడత లింగరాజు, పగిడిమర్రి నాగేంద్రచారి, గౌతమ్, జిడిఆర్ జానీ, గౌటే కనకయ్య, పెరుమాళ్ళ శ్రీనివాస్, కొంచెం రాజ్ కుమార్, చిన్ననాయక్, షేక్ ఫయాజ్ ఉన్నారు

## నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



సంస్థాన్ నారాయణపురం,ఆగస్టు06,( వార్త మిర్రర్ ):
సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన కీర్తిశేషులు ధాత్రిక్ విటలయ్య అకాల మరణం చింతిస్తూ ఆయన భౌతిక గాయం పై పూలమాలలు వేస్తూ ఆయన నిత్యం ఆప్యాయంగా గ్రామ ప్రజలను పెద్దలను పలకరిస్తూ ఉండేవారని,గ్రామంలో చేసిన సేవలు రాజకీయంగా చేసిన పనులను గుర్తు చేసుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు కాంగ్రెస్ పార్టీ నాయకులు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ,డిసిసి కార్యదర్శి ఏపూరి సతీష్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండి అక్బర్ అలీ,మాజీ నల్గొండ డిసిసిబి డైరెక్టర్ ఏర్పుల సుదర్శన్,సంస్థాన్ ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు సింగం కృష్ణ,కాంగ్రెస్ నాయకులు బద్దుల యాదగిరి,వలిగొండ మాధవులు,అంతటి స్వామి గౌడ్,సామాజిక ఉద్యమకారుడు ఉప్పల ఆంజనేయులు,తదితరులు,పాల్గొన్నారు.



## శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాల ఏర్పాట్లను సమీక్షించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 6... మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిరియాల గ్రామంలో జరుగుతున్న శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఏర్పాట్లను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వ్యక్తిగతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల సందర్భంగా వేలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జల, విద్యుత్, రవాణా, శుభ్రత, ఇతర మౌలిక సదుపాయాలు సమర్థంగా అందుబాటులో ఉండేలా అధికార యంత్రాంగం పని చేయాలి,అని స్పష్టం చేశారు. ఈ సమీక్ష కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## పసునూరి బిక్షపతి చారి కి ఆచార్య జయశంకర్ అవార్డు

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 6... తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ 91వ జయంతి సందర్భంగా బుధవారం నాడు విశ్వబ్రాహ్మణ సంఘం రంగారెడ్డి జిల్లా మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ అవార్డు అందజేశారు. బుధవారం నాడు జిల్లా మహనీయుల జయంతి ఉత్సవాల కన్వీనర్ ఆందోజు దయానంద ఆచారి ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం మీరు పేట కార్పొరేషన్ సహస్ర కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి వారి పేరు మీద ఆరుగురు ప్రజాసేవ చేసిన నాయకులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా పసునూరి బిక్షపతి చారి ఆచార్య జయశంకర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బిక్షపతి చారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో అలుపెరగని పోరాటం చేసిన యోధుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడితేనే నీళ్లు నిధులు ఉద్యోగాలు దక్కుతాయని తెలంగాణ ప్రజల బతుకులు మారుతాయని తెలంగాణ సాధనే ఆశయంగా తన జీవిత లక్ష్యం అని పోరాడిన సిద్ధాంతకర్త జయశంకర్ సార్ అని వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాతిపితగా ప్రకటించాలని వారి జయంతి వర్ధంతి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వేములవాడ మదన్మోహన్ చారి ప్రధాన కార్యదర్శి చెల్లేటి కృష్ణమూర్తి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పులిగిల్ల శ్రీనివాసచారి ప్రధాన కార్యదర్శి పెద్దకొలిమి బ్రహ్మచారి మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షులు రాపల్లి కృష్ణమాచారి నరేంద్ర చారి శ్రీనివాసచారి ఫిరంగి స్వర్ణ చారి చంద్రశేఖర చారి విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు.



## బీజేవైఎం కొండాపూర్ డివిజన్ అధ్యక్షుడుగా గుమ్మడి సాయి సుకుమార్ పటేల్

కొండాపూర్ వార్త మిర్రర్ : కొండాపూర్ డివిజన్ బీజేపీ యువ మోర్చా అధ్యక్షులుగా నియమితులైన గుమ్మడి సాయి సుకుమార్ పటేల్ , బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ , కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవి కుమార్ యాదవ్ మరియు కొండాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు అరవింద్ చక్రవర్తి చేతుల మీదుగా నియామక పత్రాన్ని స్వీకరించడం జరిగింది,కొండాపూర్ డివిజన్ బీజేపీ యువ మోర్చా అధ్యక్షులుగా నియమితులైన గుమ్మడి సాయి సుకుమార్ పటేల్ మాట్లాడుతూ..బీజేపీ సిధాంతం ఆదర్శాలకు నీతీ, నిజయితీ,నిబద్ధత, క్రమశిక్షణ , చిత్తశుద్ధితో, వ్యవరిస్తానని డివిజన్ లోని బీజేవైఎం నాయకులు , కార్యకర్తలను సమన్యాయం చేస్తూ, డివిజన్ లోని యువత , స్థానిక ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలపై పోరాటం చేస్తాని మాట ఇస్తూ ,నా పైన నమ్మకం ఉంచి , నాకు బాధ్యతను ఇచ్చిన బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ కి, గంగుల చంద్రశేఖర్ యాదవ్ కి, గంగళ రాధాకృష్ణ యాదవ్ కి, డివిజన్ బీజేపీ అధ్యక్షులు అరవింద్ కి, కైతాపురం జితేందర్ కి, బీజేవైఎం నాయకులు తోట్ల భరత్ కుమార్ కి , పిల్లి సాయి కుమార్ , డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలా రాజేందర్ రెడ్డి కి,శేరి నవీన్ రెడ్డి కి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో కొండాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు అరవింద్ చక్రవర్తి , హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ , కొండాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలా రాజేందర్ రెడ్డి , బీజేవైఎం నాయకులు రాము యాదవ్, సంపత్ మరియు ఇతరులు పాల్గొన్నారు.



## మహా సంపర్క్ అభియాన్

ఈరోజు మహా సంపర్క్ అభియాన్ లో భాగంగా రాయికల్ మండలం వస్తాపూర్, దావనపల్లి, కట్కాపూర్, తట్లావాయ్, ఆలయనాయక్ తండా,ధర్మాజీపేట గ్రామలలో రూరల్ మండల్ అధ్యక్షులు ఆకుల మహేష్ గారి ఆధ్వర్యంలోఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేసి, ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి చేసిన అభివృద్ధి పనులను వారికి వివరించడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షులు ఆకుల మహష్, మండల ప్రధాన కార్యదర్శి బండారిసాయిరాజ్ గౌడ్ ,మండల కార్యదర్శి సబితా గారు దావనపల్లి ఉప సర్పంచ్ భిక్కు నాయక్ బూత్ అధ్యక్షులు బలరాం, తిరుపతి గౌడ్ తిరుమల్ నాయక్ ఆకుల శేఖర్ ముడపెల్లి భూమయ్య సీనియర్ నాయకులు సల్లూరి తిరుపతి నర్సయ్య గంగారెడ్డి రంజిత్ బీజేవైఎం నాయకులు సుమన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జయశంకర్ కు నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు

మిర్యాలగూడ , ఆగస్టు 6:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందున్న ప్రొపెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించిన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డినివాళులర్పించి మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని తన రచనలతో ఎండబెట్టి, తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం దశాబ్దాల తరబడి కృషి చేసి,స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళర్పించారు.కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి నాగునాయక్, ఉబ్బపల్లి కాశయ్య, మాజీ కౌన్సిలర్లు ఎల్. రవినాయక్, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



## జయశంకర్ కు నివాళులర్పించిన జిల్లా అదనపు కలెక్టర్ అమిత్

మిర్యాలగూడ , ఆగస్టు 6:-( వార్త మిర్రర్) తెలంగాణా ఉద్యమ స్ఫూర్తిప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్బంగా బుధవారం మిర్యాలగూడ సబ్ కలెక్టరేట్ లో అయన చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్, డిఎఓ శ్రీనివాస్ శర్మ, ఎస్ఏ అబ్బాస్, జెఎ ఎండి. జమాల్, జర్నలిస్టులు ఖాజా హామీదుద్దీన్, ఎండి.అస్లాం, జి. వెంకన్న, జి.మహేష్, మంద సైదులు, మనోజ్ నివాళులు అర్పించారు. అదేవిధంగా మునిసిపల్ కార్యాలయంలో కమీషనర్ జి.శ్రీనివాస్, డిఇఇ వెంకన్న, మేనేజర్, ఆర్ఓ జి.జ్ఞానేశ్వరి, కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానాచార్యులు మల్లిరెడ్డి భీమార్జునరెడ్డి, కళాశాల ఐక్యూఏసి సమన్వయకర్త నాగరాజు, అధ్యాపకులు శివకృష్ణ, వెంకటరమణ, నరేశ్, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు జయశంకర్ కు ఘనంగా నివాళులర్పించారు.



## బాలాపూర్ చౌరస్తా లో
## ఘనంగా కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 6 ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అర్పించిన ఆచార్య కొత్త పల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బుధవారం బాలాపూర్ చౌరస్తా లో బిఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు జమాల్ పూర్ సునీత బాలరాజ్ ఆధ్వర్యంలో ఆచార్య కొత్త పల్లి జయశంకర్ సార్ విగ్రహనికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమం లో మీర్పేట్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు దిండు భూపేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, ఏనుగు అనిల్ కుమార్ యాదవ్, దోమల పల్లి రాజకుమార్, పార్టీ నాయకులు దయానంద్ ముదిరాజ్, సింగం రాజు, మోహన్, రాజేష్, సాయి, సాయి చందు,బిందు శివ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# పర్వతాలను అభినందించిన హెచ్.సి.యు. వీసీ. బి.జె.రావు



దేవరకొండ ఆగష్టు 06 వార్త మిర్రర్ :పంబాల కులానికి ప్రత్యేకమైన సంప్రదాయ కళా రూపమైన పంబ కళపై నేరేడుగొమ్ము మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన పంబాల పర్వతాలు జరిపిన లోతైన పరిశోధనకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి విశేష అభినందనలు లభించాయి. పంబాల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థితిగతులను సాంప్రదాయ కళల దృష్టికోణంలో విశ్లేషిస్తూ, ఈ పరిశోధన నూతన కోణాన్ని ప్రతిపాదించింది.ఎన్నో ఏండ్లుగా నిర్లక్ష్యానికి గురైన పంబాల వారు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రంగా తీసుకుని, పర్వతాలు పేదరిక నిర్మూలన, ఆహార భద్రత, నాణ్యమైన విద్య మరియు శాశ్వత పరిష్కారాల వంటి అంశాలను విశ్లేషించారు.పంబ కళలను ప్రోత్సహించే కార్యక్రమాల ద్వారా పంబాల వంటి వెనుకబడిన కులాలకు ఆదాయ వనరులు కలిగే అవకాశం ఉందని, తద్వారా వారసత్వ కౌశల్యాలు కాపాడబడతాయని ఈ పరిశోధనలో పేర్కొనబడింది. ఆర్థిక స్థిరత పెరిగితే పౌష్టికాహార సమస్యలు తగ్గిపోతాయని, విద్యా అవకాశాలు పెరిగితే సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. పట్టణీకరణ నేపథ్యంలో వంశ పారంపర్యంగా వస్తున్న కళలు రూపాంతరం చెందుతున్న పరిస్థితిలో, వాటిని రక్షించటం అత్యవసరమని ఈ పరిశోధన సూచిస్తోంది.ఈ పరిశోధనను పూర్తిగా పరిశీలించిన అనంతరం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి. జె. రావు "ఈ అధ్యయనం ప్రజల జీవనవిధానాన్ని, వారసత్వ కళలను అభివృద్ధి లక్ష్యాల దృష్టిలో నిలుపుతూ చేసిన అరుదైన ప్రయత్నం" అని ప్రశంసించారు. తెలుగు శాఖాధ్యక్షులు ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు ఈ పరిశోధనను "సాంప్రదాయ కళల పరిరక్షణకు మార్గదర్శిగా నిలుస్తుంది" అని అభివర్ణించారు.పరిశోధనకు పర్యవేక్షకులుగా వ్యవహరించిన డా. దార్ల వెంకటేశ్వరరావు గారు ఈ అధ్యయనం "విచారశీల అధ్యయనాలకు ఓ మైలురాయి" అని అభిప్రాయపడ్డారు.దక్షిణ భారతదేశంలో పర్యటించి నిబద్ధతతో ఈ పరిశోధనను పూర్తి చేసినందుకు పర్వతాలను విశ్వవిద్యాలయ వర్గాలు హృదయపూర్వకంగా అభినందించాయి. సాంప్రదాయ కళలను ఆధారంగా తీసుకుని సమాజ అభివృద్ధిలో వాటి పాత్రను ఆవిష్కరించే ఈ తరహా పరిశోధనలు, అట్టడుగు వర్గాల చైతన్యానికి ప్రేరణగా నిలవనున్నాయని విద్యావేత్తలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ ఎన్నికల హామీ పదివేలు జీతం వెంటనే అమలు చేయాలి

దేవరకొండ ఆగష్టు 06 వార్త మిర్రర్ :ఏఐటీయూసీ రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై దేవరకొండ ఆర్ డి ఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం ఆర్డీవో ఏవో కు వినతి పత్రం సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, నూనె రామస్వామి మాట్లాడుతూ వంట బకాయి బిల్లులు జీతాలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వ హామీలో భాగంగా 10,000 రూపాయల వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలని కోడిగుడ్లను, వంట గ్యాస్ ను ప్రభుత్వమే సరఫరా చేయాలని యూనిఫారం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రతి విద్యార్థికి తరగతితో సంబంధం లేకుండా రోజుకు 25 రూపాయలు చెల్లించాలని నెల నెల పెండింగ్లో బిల్లు లేకుండా జీతాలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని అధికారుల రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జూలూరి వెంకట రాములు మండల కార్యదర్శి అలముని మల్లయ్య




మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల కార్యదర్శి నోముల ధనలక్ష్మి సిలువేరు నారయ్య అజీబేగం వెంకటయ్య వెంకటమ్మ సాయిలు శోభారాణి మౌనిక బుజ్జమ్మ అలివేలు పాల్గొన్నారు.

# మాడుగుల పల్లి, వేములపల్లి మండలాల్లో తల్లిపాల వారోత్సవాలు

మిర్యాలగూడ ఆగస్టు 6:-( వార్త మిర్రర్) దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోని ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్. చంద్రకళ ఆధ్వర్యంలో మాడ్గులపల్లి మండలం ఇందుగుల్లా, చెరువుపల్లి గ్రామాల్లో,వేములపల్లి మండలం వేములపల్లి 3 అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పరిమి రజిని, లక్ష్మిలు ఆయా కేంద్రాల్లో మాట్లాడుతూ గర్భిణిగా ఉన్నప్పుడు నుంచే సరైన పోషకాహారం తీసుకోవాలని , బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టించాలని తల్లిపాల లో కొలెస్ట్రామ్ ఉంటుందని బిడ్డకు తల్లిపాలు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని తల్లిపాలలో అన్ని రకాల విటమిన్స్ పోషకవిలువలు ఉంటాయని తప్పనిసరిగా బిడ్డ పుట్టినప్పటినుంచి ఆరు నెలలు నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని ఏడవ నెల నుండి రెండు సంవత్సరాల వరకు అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలు కొనసాగించాలని అన్ని టీకాలు వేయించాలని తల్లులకు తెలిపారు. తదుపరి గృహాలు సందర్శించారు. సూపర్వైజర్ పరిమి రజని, అంగన్వాడీ టీచర్స్ రజిత, శశికళ, ఏఎన్ఎం శైలజ ,కవిత ఆశా వర్కర్స్, ఆయా వినోద, మాట్లాడుతూ గర్భిణిగా ఉన్నప్పుడు నుంచే సరైన పోషకాహారం తీసుకోవాలని , బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టించాలని తల్లిపాల లో కొలెస్ట్రాల్ ఉంటుందని బిడ్డకు తల్లిపాలు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని తల్లిపాలలో అన్ని రకాల విటమిన్స్ పోషకవిలువలు ఉంటాయని తప్పనిసరిగా బిడ్డ పుట్టినప్పటినుంచి ఆరు నెలలు నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని ఏడవ నెల నుండి రెండు సంవత్సరాల వరకు అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలు కొనసాగించాలని అన్ని టీకాలు వేయించాలని తల్లులకు తెలిపారు. సూపర్వైజర్ లక్ష్మి, ఐసిపి



ఎస్ కౌన్సిలర్ రమణి, టీచర్స్ నాగమణి సునంద వరలక్ష్మి, జడ్పిహెచ్ ఎస్ హెడ్ మాస్టర్ వినోద్ కుమార్, వనజాత, హెల్త్ సూపర్వైజర్ నర్సయ్య గారు,అంగన్వాడీ టీచర్లు షకీరా బాను,హేమలత, పద్మ , ఆయా సోమమ్మా,ఆశాలు కోటమ్మ,సావిత్రి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టల్ల పరిరక్షణ, విద్యారంగా సమస్యలను పట్టించుకోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు




మిర్యాలగూడ , ఆగస్టు 6:-( వార్త మిర్రర్) ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూలై 30 నుంచి ఆగస్టు 6 వరకు సంక్షేమ హాస్టళ్ళ సంరక్షణ ప్రభుత్వ విద్య పరిరక్షణకై చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర ముగింపు సందర్భంగా పట్టణంలో 3,000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బహిరంగ సభ నిర్వహించారు. బహిరంగసభలో ముఖ్యఅతిథి రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు మాట్లాడుతూ గత 8 రోజులపాటు నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఎండల్లో ఎన్నుకుంటూ వానల్లో తడుచుకుంటూ విద్యార్థుల సమస్యలను అధ్యయనం చేసిన నల్గొండ జిల్లా కమిటీకి యాత్ర బృందానికి ధన్యవాదాలు తెలిపారు. పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడం దుర్మార్గం అన్నారు.ఎస్సీ, ఎస్టీ ,బీసీ ,మైనార్టీ అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు సొంతభనాలు కట్టించడంలో విఫలమయ్యారన్నారు. ఎస్సీ ,ఎస్టీ, బీసీ ,సంక్షేమ హాస్టల్ లో ఉండే పేద మధ్యతరగతి విద్యార్థులకు ఇప్పటివరకు రెండు జతల బట్టలు, దుప్పట్లు విద్యార్థులకు ఇవ్వవలసిన కనిస వస్తువులు కాస్మోటిక్ చార్జీలు, మెస్ ఛార్జీలు, విడుదల చేయకుండా విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు త్రాగునీరు మరుగుదొడ్లు లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతూ విద్యను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం పది రూపాయలతో విద్యార్థులు రుచికరమైన భోజనం ఏ విధంగా తింటారో రాష్ట్ర సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లాలో సైకిల్



యాత్రలో కొన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినిలు మధ్యాహ్న భోజనం బాగాలేక కడుపునిండా భోజనం తినలేక ఆరోగ్యం సహకరించకున్నా తరగతి గదిలో పాఠాలను వినాల్సి వస్తుందని విద్యార్థులు యాత్ర దృష్టి కి తీసుకురావడం జరిగిందన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను గురుకులాలను కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలను అభివృద్ధి చేయకుండా వందల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరుతో అనేక అవినీతి అక్రమాలకు కాంట్రాక్టర్ల కమిషన్ల కోసం తాపత్రయపడుతున్న తప్ప విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంలో ఏమాత్రం ముందుకు పోవడం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ కన్నతల్లికి అన్నం పెట్టకుండా పిన్న తల్లికి బంగారు గాజులు చేపిస్తుందంటే నమ్ముదామని ఉన్న ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయకుండా ఉన్న విద్య సంస్థలను అభివృద్ధి చేయకుండా ఇంటిగ్రేటెడ్ స్కూల్లో 5000 మందిని ఒకే చోట ఉంచి చదివించడం ఏ విధంగా సాధ్యమైతుందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను కూడా కట్టి కాంగ్రెస్ ప్రభుత్వం మీద బలమైన విద్యార్థి సమరశీల పోరాటాలకు విద్యార్థులు కానీ సిద్ధం చేస్తామని బలమైన పోరాటాలు నడిపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మూడావత్ రవినాయక్, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పరశురాం, ఐద్వా జిల్లా అధ్యక్షులు వరలక్ష్మి, మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ఎఫ్ఐ నాయకులు ధీరావత్ శ్రీను నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదా నాయక్, కుంచం కావ్య,కోరే రమేష్, ముస్కు రవిందర్,మారుపాక కిరణ్, స్పందన, జగదీష్ జగన్ నాయక్, వీరన్న, సంపత్ ప్రసన్న రాకేష్ భార్గవ్ ప్రణిత్, సూర్య, రమేష్, వినోద్, సిద్ధు, శంకర్ సూర్య రమేష్ మణి పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ పీజీ కాలేజీలో తీజ్ ఉత్సవలో పాల్గొన్న
# లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య సంతోష్ నాయక్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర రాజధాని సికింద్రాబాద్ పీజీ కాలేజీలో తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ ప్రపంచంలో భిన్న సంస్కృతుల్లో బంజర సంస్కృతి ఒకటి, ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి బంజారా సంస్కృతి తీజ్ పండుగ ఉత్సవాల్లో తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహిస్తారు, పెళ్లి కానీ అమ్మాయిలు నియమ నిష్టతలతో, పవిత్రతను పాటిస్తూ ప్రతిరోజు తీజ్ కి నీళ్లు పోసుకుంటూ పాటలు పాడుతూ తండాలో ప్రజలు సుఖ తోషాలతో అన్నదమ్ములు అందరూ కలిసి ఆరోగ్యంగా ఉండాలని భవిష్యత్తులో మంచి వరుడు రావాలని మేరమ్మ యాడిని పూజిస్తారు, తొమ్మిది రోజులు పాటు ఉపవాసం అంటూ తీజ్ పండుగ వేడుకలు నిర్వహిస్తారు, ఈ కార్యక్రమంలో కుర్ర మోతిలాల్ నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవి నాయక్, బంజారా సింగర్స్ ప్రముఖులు విద్యార్థులు మహిళలు తదితరులు పాల్గొన్నారు





## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :తెలంగాణ జాతిపిత, తెలంగాణ తొలి , మలిదశ ఉద్యమ వారిధి, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి సందర్భంగా లింగంపల్లి రైల్వే బ్రిడ్జ్ దగ్గర ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల నివాళులు అర్పించడం జరిగింది,ఈ కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గం విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం అధ్యక్షులు కంజర్ల కృష్ణమూర్తి చారి , విశ్వకర్మ ఫౌండేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రవీంద్ర చారి, వెంకటాచారి,ఏం మల్లికార్జున శర్మ, వీర బ్రహ్మచారి, పురుషోత్తమ శర్మ, గోవిందరావు, సాయన్న , శ్రీనివాస్ చారి, రాజేందర్ చారి పాల్గొనడం జరిగింది.




## జంతర్ మంతర్ బిసి రిజర్వేషన్ ధర్నాలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్

మిర్యాలగూడ , ఆగస్టు 6:- (వార్త మిర్రర్) ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రం ఆమోదించాలని కోరుతూ బుధవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్ లు, రాష్ట్ర, జిల్లా నాయకులు నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బి ఎల్ ఆర్, ఎమ్మెల్సీ కె. శంకర్ నాయక్, ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలువురు నాయకులు పాల్గొన్నారు. రాహుల్ గాంధీ చిత్రపటాన్ని, 42శాతం బిసి రిజర్వేషన్ ప్లే కార్డు ప్రదర్శించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని కోరారు.




## సీతారాంపురంలో తల్లి పాల వారోత్సవాలు

మిర్యాలగూడ , ఆగస్టు 6:- (వార్త మిర్రర్) తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని సీతారాంపురం సెక్టార్ సీతారాంపురం 2-2లో సిడిపిఓ మమత ఆదేశాలతో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్వైజర్ సిహెచ్ పద్మ, లీలా కుమారి గారు మాట్లాడుతూ గర్భిణీ ప్రసవించిన తర్వాత వచ్చే ముర్రుపాలను బిడ్డకు గంటల్లోపు పట్టాలన్నారు. గృహ సందర్శనలో ఆరు నెలల నిండిన తర్వాత బిడ్డకు తల్లిపాలు కొనసాగిస్తూ అనుబంధ ఆహారం మొదలు పెట్టాలని వివరించారు. ఆపై పిల్లలకు హైజినిక్ గురించి వివరిస్తూ హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ రమాదేవి, మీరాజ్ సుల్తానా, ఆయా పూర్ణిమ, ఏఎన్ఎం శోభారాణి ఆశ వర్కర్ ప్రవీణ, అమృత లక్ష్మి, గర్భిణీ స్త్రీలు బాలింతలు పిల్లలు తల్లులు పాల్గొన్నారు





## నాణ్యతపై ఎటువంటి రాజీ లేకుండా, వేగంగా పనులను పూర్తిచేయాలి..సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 6 ...మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రావిర్యాల చెరువు కట్టపై జరుగుతున్న సుందరీకరణ పనులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ లేకుండా, వేగంగా పనులను పూర్తి చేసి చెరువును ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ఈ అభివృద్ధి కార్యక్రమాలు భావితరాలకు గుర్తుండిపోయే విధంగా ఉండాలి అని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి టెక్నాలజీ కేంద్రంగా హైదరాబాద్ : జయేష్ రంజన్

### ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ను కలిసిన స్వతంత్ర సినీ దర్శకుడు జయభరత్ రెడ్డి




వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 06 : హైదరాబాద్ ప్రపంచస్థాయి టెక్నాలజీ కేంద్రంగా ఎదగడమే కాకుండా స్థానిక ఆవిష్కర్తలకు కూడా అద్భుత వేదికగా మారిందని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. "హైదరాబాద్ ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చిన ప్రయాణం – కృత్రిమ మేధస్సు (ఏఐ) పాత్ర" అనే అంశంపై స్వతంత్ర సినీ దర్శకుడు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణానికి చెందిన దోనూరు జయభరత్ రెడ్డి తెలంగాణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తో చర్చించారు. టి-హబ్‌లో జరిగిన ఈ సమావేశంలో హైదరాబాద్‌లో స్టార్టప్‌లు, టెక్నాలజీ రంగం, కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యాపారాలు ఎలా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి అనే విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ, " ఏఐ ద్వారా ఆరోగ్యం, పాలన, సృజనాత్మక రంగాల వరకు విస్తరించే అభివృద్ధి సాధించాలనేది మా లక్ష్యం" అన్నారు. సినీ దర్శకుడు జయభరత్ రెడ్డి మాట్లాడుతూ, "హైదరాబాద్ ఒక టెక్ సిటీ మాత్రమే కాదు, సాంస్కృతికంగా కూడా సృజనాత్మకతతో నిండి ఉన్న నగరం. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆ అంశాన్ని ప్రపంచానికి చూపించాలనుకుంటున్నాం" అన్నారు. ఈ చర్చ నగరాన్ని ప్రపంచస్థాయి ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టడంలో విధానకర్తలు, సృజనాత్మక రంగాల మధ్య భాగస్వామ్యానికి నాంది పలికింది.

# స్వర్ణ రథ ఆహ్వాన పత్రిక పోస్టర్ ఆవిష్కరణ

దేవరకొండ ఆగస్టు 06 వార్త మిర్రర్ :శ్రీ వాసవి కళ్యాణ మండపంలో స్వర్ణ రథ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వర్ణ రథం ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రిక వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు ఈనెల 17 18 తారీకులలో స్వర్ణ రథం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ కమిటీ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య కార్యదర్శి వనపర్తి మురళి కోశాధికారి వాసా వెంకటేశ్వర్లు కార్యనిర్వాహక కార్యదర్శి రాచమల్ల వెంకటేశ్వర్ల తో పాటు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చిదేళ్ల వెంకటేశ్వర్లు కార్యదర్శి సముద్రాల ప్రభాకర్ కోశాధికారి కొత్త సుబ్బారావు వాసవి క్లబ్ అధ్యక్షులు సముద్రాల సహదేవ్ వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మహాలక్ష్మి మహిళా విభాగ్ అధ్యక్షులు గార్లపాటి రజిని ప్రపంచ ఆర్యవైశ్య మహిళా విభాగ్ పట్టణ అధ్యక్షులు చిదేళ్ల శ్రీదేవి కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు నీల బుచ్చయ్య నేరేడుగొమ్ము మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పోలిశెట్టి చంద్రశేఖర్ చందంపేట మండల ఆర్యవైశ్య సగం అధ్యక్షులు దొడ్డి మురళి ఉప్పల శ్రీనివాసులు నీలా సంజీవ కుమార్ మహిళా సంఘం సభ్యులు స్వర్ణ రథం కమిటీ సభ్యులు దేవరకొండ అన్ని సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి సబితా

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 6 ...మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్ లోని వసంత్ విహార్లో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవతలు ప్రజల భక్తి విశ్వాసాలకు ప్రతీకలు. అమ్మవారిని మానసికంగా ప్రార్థిస్తూ ఈ ప్రభుత్వం గ్రామాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆమె దయకు అప్పగిస్తున్నాం అని తెలియజేశారు. ఆవిష్కరణ అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులందరితో కలిసి భక్తిశ్రద్ధలతో గడిపారు. ఈ కార్యక్రమంలో 28వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సుర్న గంటి అర్జున్ బడంగ్పేట్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు రాముడి రామిరెడ్డి పెద్ద బావి ఆనంద రెడ్డి వంగేటి లక్ష్మారెడ్డి భీమిడి జంగారెడ్డి పెద్దబావి శ్రీనివాసరెడ్డి కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, కాలనీవాసులు మరియు ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ ఇష్యూ ప్రణాళికల్లో ఇండోసోల్

### ::: రూ. 69,000 కోట్ల పెట్టుబడులు




హైదరాబాద్: షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ అనుబంధ సంస్థ ఇండోసోల్ సోలార్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే ప్రణాళికల్లో ఉంది. రాబోయే కొన్నేళ్లలో రూ. 69,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ సీఎండీ ఎన్ విశ్వేశ్వరరెడ్డి ఈ విషయాలు వెల్లడించారు. 'ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 1 గిగావాట్ల సమగ్ర తయారీ లైన్ (ఇన్‌గోట్ నుంచి సెల్ మాడ్యూల్ వరకు) ప్రారంభించనున్నాం. ఆ తర్వాత ఐపీవోకి వచ్చే యోచన ఉంది. ప్రాథమికంగా, ప్రీ-ఐపీవో ప్లేస్‌మెంట్ ద్వారా 25-26 శాతం వాటా విక్రయించాలని భావిస్తున్నం' అని విశ్వేశ్వరరెడ్డి చెప్పారు. ఇండోసోల్‌లో షిర్డీ సాయి 51 శాతం వాటాలను తన దగ్గరుంచుకుని, దాదాపు 49 శాతం వరకు వాటాలను విక్రయించే అవకాశం ఉందని తెలిపారు. ఒకవేళ ఇండోసోల్ ఐపీవో గానీ కుదరకపోతే షిర్డీ సాయి ఎలక్ట్రికల్సే 2027 ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూకి రావచ్చని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. సోలార్ పీవీ తయారీ ప్లాంటు ఏర్పాటు కోసం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కారేడు గ్రామంలో 8,348 ఎకరాల స్థలం, అదే జిల్లాలోని చెవురు గ్రామంలో మరో 114.5 ఎకరాల స్థలాన్ని ఇండోసోల్‌కి కేటాయించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**భవిష్యత్ ప్రణాళికలు..**

పాలీసిలికాన్‌కి ముడి వనరైన క్వార్ట్జ్ మైనింగ్‌కి సంబంధించి కర్నూలు, అనంతపురంలో మైనింగ్ హక్కులు దక్కించుకున్నామని విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. రూ. 25,000%-%రూ. 28,000 కోట్లతో ఫేజ్1లో భాగంగా తలపెట్టిన 10 గిగావాట్ల లైన్ వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఏర్పాటవుతుందని పేర్కొన్నారు. దీర్ఘకాలంలో 90,000 మిలియన్ టన్నుల (ఎంటీ) పాలీసిలికాన్ ఉత్పత్తి తదితర లక్ష్యాలతో ఇండోసోల్ ప్రాజెక్టుపై పెట్టుబడులు మొత్తం మీద రూ. 64,000 కోట్లుగా ఉంటాయని విశ్వేశ్వరరెడ్డి చెప్పారు. ఇందుకోసం అంతర్గతంగాను, అలాగే ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఇరెడా) నుంచి నిధులు సమీకరిస్తున్నట్లు తెలిపారు. బహుళ జాతి సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించారు. మరోవైపు, షిర్డీ సాయి ఆర్డర్ బుక్ రూ. 12,000 కోట్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 3,000 కోట్లుగా ఉండగా, ఈసారి రూ. 6,500 కోట్లు అంచనా వేస్తోంది.

# తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### ::: ఎస్సై మాధవరెడ్డి




కల్వకుర్తి ఆగస్టు 6 వార్త మిర్రర్ ప్రతినిధి:- డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధించారని ఎస్సై మాధవ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రోజు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కల్వకుర్తి మండలం సిలార్ పల్లి గ్రామానికి చెందిన వానరాశి శ్రీశైలం,గాంధీనగర్ కు చెందిన తాండోజు చక్రపాణి అనే వ్యక్తులు మద్యం సేవించి వాహనం నడపడంతో కేసు నమోదు చేసి, 600 రూపాయల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అలా కాకుండా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని అన్నారు.



## రాజ్ భూపాల్ గౌడ్, అందెల ను మర్యాద పూర్వకంగా కలసిన బిజెపి నాయకులు

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 6 ...భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ మహేశ్వరం నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు ను మర్యాద పూర్వకంగా కలిసిన మీర్పేట్ .1, బిజెపి అధ్యక్షులు బిక్షపతి చారి ,ప్రధాన కార్యదర్శులు ద్యాసని తిరుపతి రెడ్డి ఇంద్రావత్ రవి నాయక్ నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులందరూ ఉన్నారు



# సంగారెడ్డి జిల్లా: అన్నారంలో భారీ అగ్నిప్రమాదం

సంగారెడ్డి జిల్లా: గుమ్మడిదల అన్నారంలో గ్రామంలో గుబ్బ కోల్డ్ స్టోరేజ్ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. కోల్డ్ స్టోరేజ్‌కు సంబంధించిన పరిశ్రమలో మంటలు చెలరేగి భారీగా వ్యాపించాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాల వరకు విస్తరించాయి. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. మంటలను అదుపు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ప్రస్తుతానికి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వివరాలు వెల్లడి కాలేదు